సాక్షి
జనగామ
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నిందితులను మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో▸



బయోమెట్రిక్ షురూ..

కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు అమలులోకి వచ్చింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^{0}/23^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



బచ్చన్నపేట: వేసవి సెలవుల్లో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలి.. చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లనీయొద్దని జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి బండనాగారం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి ఉన్న ఊరు, కన్నవారి పేరు నిలబెట్టాలని అన్నారు. అంతకు ముందు చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివరాత్రి కవిత, గంగం సతీష్‌రెడ్డి, ఉపసర్పంచ్ బత్తిని రాజలింగం, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై నవీన్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ మానెపల్లి లావణ్య, నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆరేళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు




దేవరుప్పుల: చాలీచాలని కమీషన్‌లతో జీవనం గడుపుతున్న రేషన్ డీలర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గింపుడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలో నిర్వహించే డీలర్ల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ మండల అధ్యక్షుడు దుద్దుల పరశురాములు అధ్యక్షతన సోమవారం కడవెండిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజావసరాల కోసం నిత్యం విధులు నిర్వర్తిస్తున్న రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 5 నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బూడిద శ్రీను, గడ్డం సుజాత సత్తిరెడ్డి, మాశెట్టి నరేష్, అన్నారపు యాదగిరి, బల్లి శేఖర్, రాములు, మంగమ్మ పాల్గొన్నారు.

27నుంచి ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఈనెల 27 నుంచి ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం తెలిపారు. ఈనెల 27, 29, మే1, 3వ తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం



హన్మకొండ కల్చరల్: కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరంగల్ భద్రకాళి దేవాలయంలో మూడో రోజు సోమవారం రాత్రి భద్రకాళీభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, వేద పండితులు ఉదయం 5 గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పూలమాలలతో అలంకరించి మకర వాహనంపై ఊరేగించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ముదిరాజ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, ఉమ్మడి జిల్లాలకు చెందిన ముదిరాజ్ కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు దేవాలయంలో జరిగిన భద్రకాళీభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఉత్సవమూర్తిని చంద్రప్రభ వాహనంపై మంగళవాయిద్యాలతో ఊరేగించారు. సాయంత్రం పూజలకు మేరు వెల్ఫేర్ అసోసియేషన్ ఉభయదాతలుగా వ్యవహరించారు. పోడిశెట్టి అనిల్‌కుమార్, మేరు కులస్తులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండ

'మిషన్ వాత్సల్య' పథకం

- కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో అమలు
- విద్య, వైద్య, పోషణ ఖర్చులకు చేయూత
- ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలకు మూడేళ్లు అవకాశం
- జిల్లా కమిటీ పర్యవేక్షణలో లబ్ధిదారుల ఎంపిక నిరంతరం..
- ఇప్పటికే లబ్ధిపొందుతున్న 17 మంది బాలలు





దేవరుప్పుల : విధి వంచితులు, ఎటువంటి ఆదరణ లేని అభాగ్యుల పిల్లలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం 2009–10లో చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీస్ పేరుతో స్పాన్సర్ షిప్ పథకం తీసుకొచ్చింది. 2022 జులై 5న ఈ పథకాన్ని మిషన్ వాత్సల్యగా మార్చి కేంద్ర రాష్ట్ర భాగస్వామ్యంతో అమలు చేస్తోంది. దేశంలో పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని, పుట్టిన ప్రతి బిడ్డ నిరాదరణకు గురికాకుండా జీవించాలనే గొప్ప సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా పిల్లల విద్య, వైద్య, పోషణ అవసరాలకు ఆర్థిక చేయూత అందిస్తోంది.

పథకం గురించి..

తల్లి లేదా తండ్రి, ఇద్దరూ లేని ఒకటి నుంచి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లలకు.. ఆర్థికంగా లేదా ఇతర అనగా పిల్లల వైద్య, అభివృద్ధి అవసరాలు తీర్చేందుకు కొంత సహాయం అందించడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రాయోజిత పథకం 'మిషన్ వాత్సల్య'. స్పాన్సర్‌షిప్ ద్వారా పిల్లలకు నెలకు రూ.4వేల స్కాలర్‌షిప్ అందిస్తారు. ఇందులో కేంద్రం 60 శాతం(రూ.2,400), రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం (రూ.1,600) నిధులు సమకూర్చుతుంది. ఈ మొత్తం నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల పిల్లల సంరక్షణ, చదువు కొనసాగించేందుకు దోహదపడుతుంది.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

బాలుడు లేదా బాలిక జనన ధ్రువీకరణ, ఫొటో, స్టడీ సర్టిఫికెట్(2022–23 మాత్రమే), తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రాలు, కోవిడ్‌తో మరణించిన తల్లిదండ్రుల పాజిటివ్ టెస్ట్ రిపోర్టు, పిల్లల ఆధార్, రేషన్ కార్డు, సంరక్షకుల ఆధార్ కార్డు, పిల్లల వ్యక్తిగత లేదా తల్లిదండ్రులతో కలిగి ఉన్న జాయింట్ బ్యాంకు ఖాతా పుస్తకం, మీసేవ ఆదాయం , కుల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.

ఇవీ అర్హతలు..

- వితంతు లేదా విడాకులు తీసుకున్న లేదా కుటుంబం వదిలివేసిన తల్లికి చెందిన పిల్లలు.
- అనాథ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న అనాథ బాలలు
- ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు.. ఆర్థిక, శారీరక సమస్యలతో నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు
- బాల న్యాయ(రక్షణ, ఆదరణ) చట్టం– 2015 ప్రకారం రక్షణ, సంరక్షణ అవసరమైన, ఇల్లు లేని, ప్రకృతి వైపరీత్యాలకు గురైన, బాల్య వివాహ, బాలకార్మిక, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధిత, అక్రమ రవాణాకు గురైన, అంగవైకల్యం, తప్పిపోయిన, పారిపోయిన, వీధి, యాచక, హింసకు, వేధింపులకు, దోపిడీలకు గురైన, సహాయం , ఆశ్రయం అవసరమైన, కరోనా(కోవిడ్ –19)తో తల్లిదండ్రులను కోల్పోయిన తదితర పీఎం కేర్ పథకం కింద నమోదైన పిల్లలు అర్హులు.

ఆర్థిక పరిమితి

- రెసిడెన్సియల్ స్కూల్‌లో చదువుతున్న బాలలకు ఈ పథకం వర్తించదు
- గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలకు మించరాదు.
- పట్టణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.96 వేలు మించకూడదు.

స్పాన్సర్‌షిప్ కాలపరిమితి

- ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలకు అర్హతను బట్టి మూడేళ్లు అవకాశం
- ఈ పథకం 18 ఏళ్ల వయస్సు నిండే వరకు లేదా పథకం ముగింపు వరకూ బాలలు విడిచిపెట్టి ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ) చేరినప్పుడు ఈ స్పాన్సర్‌షిప్ ఆర్థిక సహాయం నిలిచిపోతుంది.
- పిల్లలు 30 రోజులకు మించి స్కూల్‌కు హాజరు కాకుంటే సదరు స్పాన్సర్ షిప్ నిలిపివేస్తారు. ఇందులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మినహాయింపు ఉంటుంది.
- పథకానికి అర్హత సాధించిన పిల్లలు భవిష్యత్‌లో ఏదైనా ప్రభుత్వ హాస్టల్‌లో చేరితే అక్కడి నుంచి పథకం వర్తించదు.
- స్పాన్సర్‌షిప్ కమిటీ వారు ప్రతి సంవత్సరం పథకాన్ని సమీక్షించి అర్హతను బట్టి నిలిపివేయవచ్చు లేదా కొనసాగించవచ్చు.
- తల్లి చనిపోయి తండ్రి వేరే వివాహం చేసుకుంటే అటువంటి పిల్లలకు ఈ పథకం వర్తించదు. ఎందుకంటే తండ్రి, పిన తల్లి ఉన్నారు కాబట్టి.

అత్యంత నిస్సహాయ స్థితి పిల్లలకు చేయూత



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పాన్సర్‌షిప్ ద్వారా అమలయ్యే మిషన్ వాత్సల్య పథకం అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న అభాగ్యుల పిల్లలకు మాత్రమే వర్తిస్తుంది. కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాటైన కమిటీ ద్వారా హోమ్‌స్టడీతో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుంది. ఇప్పటికే జిల్లాలో 17 మంది లబ్ధిదారులకు ఆర్థిక చేయూత కల్పిస్తున్నాం. ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం లేదా సమీపాన ఉన్న జిల్లా కేంద్రంలో తగిన పత్రాలతో దరఖాస్తు అందజేయవచ్చు.

- జెట్టి జయంతి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

భవిష్యత్ ప్రణాళికపై అవగాహన కల్పిస్తాం

రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్లీనరీ సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి

దేవరుప్పుల: తెలంగాణ పునర్నిర్మాణంలో సీఎం కేసీఆర్ సఫలీకృతమై.. దేశ రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహించే బీఆర్‌ఎస్ భవిష్యత్ ప్రణాళికపై విస్తృత అవగాహన కల్పిస్తామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. స్థానిక తిరుమల గార్డెన్ ఏరియాలో మంగళవారం నిర్వహించే పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ప్లీనరీ ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. దగాపడిన తెలంగాణను అభివృద్ధి చేసిన అత్యంత ప్రాధాన్యత కలిగిన 32 అంశాలపై ప్లీనరీకి వచ్చే పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా క్లస్టర్ ఏరియాలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఇంటింటా కేసీఆర్ ప్రజారంజక పథకాలపై వివరించామని చెప్పారు. ప్లీనరీకి సబ్బండ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఐదువేల మందికి ఆహ్వానం పలికినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. దేవరుప్పుల జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్‌రామిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్, నవీన్, రామోజీ, పల్ల సుందర్‌రామిరెడ్డి, గాంధీనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఎంపీపీలు సావిత్రి, నాగిరెడ్డి, జెడ్పీటీసీలు శ్రీనివాసరావు, పాము శ్రీను, మార్కెట్ చైర్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీలతో పార్టీ పటిష్టం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: ప్లీనరీలతో పార్టీ మరింత పటిష్టంగా తయారవుతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ సమీప బ్రమరాంభ కన్వెన్షన హాల్‌లో మంగళవారం నిర్వహించే బీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ ప్లీనరీ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. పార్టీ శ్రేణులు సకాలంలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంట నష్టం నివేదిక సిద్ధం చేయండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి
- హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

జనగామ రూరల్: ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేసి.. మే రెండో తేదీలోగా అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశించారు. వడగళ్ల వాన, ప్రస్తుత పరిస్థితులు, పంట నష్టం వివరాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. బచ్చన్నపేట, రఘునాథపల్లి, జనగామ మండలాల్లో పంటల నష్టం తీవ్రత అధికంగా ఉందని, వ్యవసాయ, రెవెన్యూ అధికారు ద్వారా వివరాలు సేకరిస్తూ రైతులకు మనోధైర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఏఓ వినోద్‌కుమార్, డీసీఎస్‌ఓ రోజారాణి, డీఎం సంధ్యారాణి, సీపీఓ ఇస్మాయిల్, డీఎంహెచ్‌ఓ మనోహర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్సీ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మలేరియాను అరికట్టాలి

సమష్టి కృషితోనే మలేరియాను అరికట్టాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వ్యాధి నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టలో వేసి తరలించాలని సూచించారు. నీటి నిలువ ప్రదేశాలు లేకుండా చూడడంతో పాటు దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. ఫాగింగ్ నిర్వహించాలని చెప్పారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



వడ్లకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్/నర్మెట: తెలంగాణ ప్రభుత్వం రైతులను అండగా ఉంటుంది.. పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం జనగామ మండలం వడ్లకొండ, నర్మెట మండలం హన్మంతాపూర్, బొమ్మకూర్, వెల్దండ, గండిరామారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. వడగళ్లతో పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. నర్మెటలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని బీజేపీ దద్దమ్మలు, అసమర్థ కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే తేవాలని డిమాండ్ చేశారు. ఓటమి భయం పట్టుకున్న ప్రతిపక్షనాయకులు ప్రజల్లో చిచ్చుపెట్టేందుకు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు మేకల కళింగరాజు, తేజావత్ గోవర్ధన్, సర్పంచ్‌లు బోల్లం శారద, పగడాల విజయ నర్సయ్య, శంకర్ నాయక్, కంతి హేమలతా రాజలింగం, నర్రా వెంకట రమణారెడ్డి, అమెడపు కమలాకర్‌రెడ్డి, జాల స్వేతా కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. జనగామ మండలంలోని పసరమడ్ల, శామీర్‌పేట, మరిగడి గ్రామాల్లో ఎంపీపీ కళింగరాజు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

సమగ్ర నివేదిక పంపించాలి



మన్‌సాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ

బచ్చన్నపేట: వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతుల వివరాల సమగ్ర నివేదికను విస్తరణాధికారులు పంపించాలని డీఏఓ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం మన్‌సాన్‌పల్లి, కొన్నె, లింగంపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.ఎస్.బీనాతో కలిసి పర్యటించిన ఆయన పంట నష్టాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణాధికారులు తప్పకుండా పంట పొలాల వద్దకు వెళ్లి చూడాలని, రైతులందరికీ ముందు సమాచారం ఇస్తే పరిశీలన చాలా సులువు అవుతుందన్నారు. అదనపు ఏఈఓలను సహాయంగా పంపిస్తున్నామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క



హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో గజమాలతో భట్టికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి హసన్‌పర్తిలో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

– కమలాపూర్/ఎల్కతుర్తి

- 8లో▸

వదలని వడగళ్ల వాన

మూడోరోజూ బీభత్సం

- రెండు గంటలపాటు గాలులు, పిడుగులతో వర్షం
- రోడ్లపై కూలిన చెట్లు
- ఐదు మండలాల్లో ఆగమాగం
- బచ్చన్నపేటలో అత్యధికంగా 46 మి.మీ. వర్షపాతం నమోదు



జనగామ పట్టణంలో సోమవారం రాత్రి జోరుగా కురుస్తున్న వర్షం

జనగామ రూరల్: వడగళ్ల వాన అన్నదాతను వదలడంలేదు. శనివారం, ఆదివారం విధ్వంసం సృష్టించిన వరుణుడు.. సోమవారం రాత్రి మరోసారి విరుచుకుపడ్డాడు. జనగామ, నర్మెట, బచ్చన్నపేట, రఘునాథపల్లి, తరిగొప్పుల మండలాల్లో ప్రచండ వేగంతో గాలులు, వడగళ్లు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. జనగామ మండల పరిధి వెంకిర్యాల, గానుగుపహాడ్, ఎర్రగొల్లపహాడ్, మరిగడి, పెంబర్తి, అడవికేశ్వాపూర్, పెద్దపహాడ్, వడ్లకొండ గ్రామాల్లో రాళ్ల వానతో పొలాల్లో వరి గింజలు రాలిపోయాయి. మామిడి తోటలు దెబ్బతిన్నాయి. రోడ్లపై చెట్లు కూలాయి. వెంకిర్యాలలో పెద్ద సైజులో పడిన వడగళ్లు ఇళ్లలోకి నీటితో కొట్టుకొచ్చాయి. వడ్లకొండలో గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా వరద నీరు చేరింది. పలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. బచ్చన్నపేట మండల పరిధి కట్కూర్, బండనాగారం, లక్ష్మాపూర్, బోనకొల్లూర్, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి పంట, మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. జనగామ పట్టణంలో భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు వార్డుల్లో రోడ్ల వెంట నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సోమవారం రాత్రి 8.30 నుంచి 10.00 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లు)

బచ్చన్నపేట	46
జనగామ	45.3
లింగాలఘణపురం	34.8
వడ్లకొండ	25.0
నర్మెట	23.3
పడమటికేశ్వాపూర్	19.3
రఘునాథపల్లి	11
అబ్దుల్‌నాగారం	7.3
తరిగొప్పుల	6
తాటికొండ	4.8
మల్కాపూర్	2.5
స్టేషన్‌ఘన్‌పూర్	1.8



వెంకిర్యాలలో వరి పంటలో నీరు



రహదారిపై కుప్పగా వడగళ్లు



పెంబర్తి గ్రామ పంచాయతీ సమీపంలో కూలిన వృక్షాలు



వెంకిర్యాలలో ఇంటిలోకి వచ్చిన వడగళ్లను ఎత్తిపోస్తున్న మహిళ



బచ్చన్నపేట : కేసిరెడ్డిపల్లిలో పొలంలో రాలిన వడ్లు

సగటు వర్షపాతం 11.3 మి.మీ.

జిల్లా వ్యాప్తంగా సోమవారం సగటు వర్షపాతం 11.3 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు వాతావరణ సమాచార అధికారి ఇస్మాయిల్ తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లో వర్షపాతం నమోదు కాగా.. కరీంనగర్ 16.7 మిల్లీ మిటర్లతో మొదటి స్థానంలో ఉండగా.. 11.3 మిల్లీమీటర్లతో జనగామ రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు మండలాల్లో అధికంగా వర్షం కురిసిందని, అందులో బచ్చన్నపేటలో అత్యధికంగా 46 మిల్లీమీటర్లు నమోదైనట్లు వివరించారు.

క్లుప్తంగా

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి మే 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు టైంటేబుల్ ప్రకారం రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలు ఉదయం , మధ్యాహ్నం ఉంటాయి. అలాగే ఇంటర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఉంటాయి. సబ్జెక్టుల ప్రకారం ఏ సమయంలో ఉంటే ఆ సమయంలో పరీక్షలకు హాజరవుతారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హై , ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు సోమవారం తెలి పారు. ఇంటర్‌లో ఆరు జిల్లాలు కలిపి 4,518 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. టెన్త్ పరీక్షలకు 2,567 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలు

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ ములుగు అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి మాధవి సోమవారం తీర్పునిచ్చారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన యువతి, అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో యువతి చదువు పూర్తయిన తర్వాత వివాహం చేసుకుంటానని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లితో శ్రీకాంత్ మాట్లాడడాన్ని గమనించిన అక్క మందలించింది. మనసులో పెట్టుకున్న శ్రీకాంత్ మరుసటి రోజు యువతి ఇంటికి చేరుకొని నీవు చనిపోతే సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా అనడంతో మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి ఈక సరోజన 2018 డిసెంబర్ 09న అప్పటి ఎస్సై మహేందర్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సోమవారం ఏపీపీ సత్యనారాయణ వాదనలతో ఏకీభవించిన అసిస్టెంట్, సెషన్ కోర్టు జడ్జి మాధవి శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- బీజేపీ పాలనలో మాయం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క
- కాకతీయ యూనివర్సిటీలో రాత్రి బస

కమలాపూర్/ఎల్కతుర్తి: కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల్లో నిరుపేదలకు సంచినిండా సరుకులిస్తే, బీజేపీ ప్రభుత్వంలో అవన్నీ మాయమయ్యాయని సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి యూనివర్సిటీలో బస చేశారు. ముందుగా కానిపర్తిలో వరి కోతలు కోస్తున్న మహిళా కూలీలు రజిత, సరోజనలతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. శంభునిపల్లి బ్రిడ్జిపై వరి ధాన్యం ఆరబోసిన మోడెం సంధ్యారాణితో మాట్లాడారు. వడ్లు బాగా ఎండితేనే కొంటామని కొనుగోలు కేంద్రాల్లో చెబుతున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షానికి 250 బస్తాల వడ్లన్నీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళా రైతుకు చేయూతగా ఆమె ఆరబోసిన వరి ధాన్యాన్ని కాసేపు భట్టి తిరగేశారు. శంభునిపల్లికి చెందిన రైతు కట్కూరి తిరుపతిరెడ్డితో మాట్లాడారు. కానిపర్తి శివారులోకి చేరుకోగానే ఓ గీత కార్మికుడు తెచ్చిన ముంజలను భట్టితోపాటు నాయకులు ఆరగించారు. ఈ సందర్భంగా భట్టి



కమలాపూర్ : శంభునిపల్లి వద్ద వరి ధాన్యం తిరగబోస్తున్న భట్టి విక్రమార్క



ఎల్కతుర్తి మండలం బావుపేటకు చేరుకున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భట్టివిక్రమార్క

విక్రమార్క గౌడన్నల మోకు, ముత్తాదు ధరించి గీత కార్మికుడు స్వామిని శాలువాతో సన్మానించారు.

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండలం గుంటూర్‌పల్లి వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బావుపేట గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకువస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన గాలివానకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంలపల్లి సత్యనారాయణ, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఫక్రుద్దీన్, చరణ్‌పటేల్, బాలసాని రమేష్‌గౌడ్, నాయకులు మేడిపల్లి సత్యం, తౌటం రవీందర్, అయిలయ్య, పోడేటి భిక్షపతి, కనుకరత్నం, సముద్రాల కృష్ణ, సాంబయ్య, వెంకట్, సీలిమా, అన్వేష్‌రెడ్డి, సుకినె సంతాజీ, ఇంద్రసేనారెడ్డి, దాట్ల రాముడు, మాల్లారెడ్డి, ముప్పు మహేందర్, మండ సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ సంపదను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం

హన్మకొండ చౌరస్తా: బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను దోచుకుంటుందని సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. హసన్‌పర్తి వద్ద ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎక్కడా డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే పంపిణీ చేస్తామని, అమ్మహస్తం పథకం పునరుద్ధరించి రేషన్ దుకాణాల ద్వారా 9 సరుకులు పంపిణీ చేస్తామన్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

- 24 గంటల్లో నిందితుడి పట్టివేత
- పోలీసులకు ఏసీపీ శ్రీనివాస్ అభినందన

కాజీపేట: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 63వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన ములుగు దేవేంద్ర ఈ నెల 22న ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపక్కనే ఉండే యాదగిరి సురేష్ గొలుసు అపహరించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా సురేష్‌పై అనుమానం వేసి విచారించగా నేరం చేసినట్లుగా అంగీకరించి గొలుసును అప్పగించాడన్నారు. చోరీ జరిగిన వెంటనే స్పందించి నిందితుడిని గుర్తించిన సీఐ సార్ల రాజు, ఎస్సై ప్రమోద్‌కుమార్, క్రైం కానిస్టేబుల్ బి.భాస్కర్, కమలాకర్‌లను ఏసీపీ అభినందించారు. త్వరలో సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సైలు మాచర్ల శ్వేత, ప్రమోద్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- ఆరుగురు కూలీలకు గాయాలు

దంతాలపల్లి: ఆటో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఆరుగురు కూలీలకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, క్షతగాత్రుల కథనం ప్రకారం ..తొర్రూరు మండలం చింతలపల్లికి చెందిన రాజబోయిన దూడాలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దినచర్యలో భాగంగా అదే గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు ఆటోను అద్దెకు తీసుకొని మరిపెడ మండలం వీరారం గ్రామ సమీపంలో మిరపకాయలు ఏరటానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన తాళ్ల యాకయ్య తన బైక్‌తో వ్యక్తిగత పనిపై దంతాలపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కూలీలతో ఆటో వస్తుంది. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఇన్నోవా వాహనం తప్పించబోయి వాహనదారుడు రోడ్డు పైకి రావడంతో వెనుక నుంచి వచ్చి ఆటో ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కె రాధిక, నాగులబోయిన గంగ, ఏర్పుల సోమలక్ష్మి, కొండూరి పిచ్చమ్మ, కొండూరి పద్మ, కమటం సామ్రజమ్మలకు గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై కూచిపుడి జగదీష్ 108 వాహనంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సైని అడుగగా ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రామన్నపేట : రాత్రి సమయంలో నగరంలో పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తున్న దొంగను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాంతండాకు చెందిన గుగులోత్ నవీన్ తొర్రూర్‌లో ఒక కాలేజీలో చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం ప్రారంభించాడన్నారు. ఇలా రాత్రి సమయంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను కీ లేకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లి వాటన్నింటిని ఒకేసారి అమ్మాలని వరంగల్ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాలో దాచిపెట్టేవాడని తెలిపారు. ఇలా అమ్మడానికి ఇద్దరిని సంప్రదించి బేరం కుదుర్చుకున్నాడని ఏసీపీ తెలిపారు. సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో అనుమానంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ మల్లేష్, ఎస్సై నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శివ, ఉపేందర్, రాజశేఖర్, ఏఎఓ సల్మాన్‌లను ఏసీపీ అభినందించారు.

వైద్య విద్యార్థుల బయోమెట్రిక్ షురూ

- రెండే పరికరాల ఏర్పాటుతో గందరగోళం
- హాజరు శాతం నమోదు చేసేందుకు ఇబ్బందులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో సోమవారం నుంచి బయోమెట్రిక్ హాజరుశాతాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. క్లినికల్ సేవలందిస్తున్న వైద్య విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడం, వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కేఎంసీని ఎంచుకుంది. ఈక్రమంలో వందలాది మంది విద్యార్థులు హాజరయ్యే ఎంజీఎంలో రెండే పరికరాలను ఏర్పాటు చేయడం గందరగోళానికి దారి తీసింది. ఉదయం 9 గంటలకు ప్రతీ విద్యార్థి తమ బయోమెట్రిక్ హాజరు వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎంజీఎం ఆర్ఎంఓ కార్యాలయాలనికి ఎదురుగా ఉన్న గదిలో బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. హాజరు నమోదు చేసుకోవడానికి వచ్చిన వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ ఎక్కడుందో తెలియక కొద్దిసేపు ఇబ్బంది పడగా.. పరికరాలు ఏర్పాటు చేసిన గదికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ గది తాళం 10 గంటల వరకు తెరవకపోవడంతో వందలాది మంది విద్యార్థుల హాజరు శాతం నమోదు చేసేందుకు పరిపాలనా కార్యాలయం వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే.. కొందరు విద్యార్థులను బయోమెట్రిక్ పరికరం గుర్తించలేదు. ఈ విషయంపై ఎంజీఎం పరిపాలన అధికారులను వివరణ కోరగా.. లోపాలను సరి చేసి విద్యార్థులకు అనుకూలంగా బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేసారు.



నమోదు చేసేందుకు గుమిగూడిన వైద్య విద్యార్థులు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు
- నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్, టౌన్ పోలీసులు గత కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం పక్కా సమాచారంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నలుగురి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బెట్టింగ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏలూరు జిల్లాకు చెందిన వలగాని రామకృష్ణ, ఖమ్మం వాసి తొట్టింపూడి విక్రమ్, చార ప్రవీణ్ కుమార్, గుంటూరుకు చెందిన ఆనంద్ కిరణ్ కలిసి మహబూబాబాద్ పట్టణంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్‌ను ప్రోత్సహించే విధంగా ప్రచారం చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు బుకీలుగా వ్యవహరిస్తూ చైన్ లింకింగ్ సిస్టం ద్వారా బెట్టింగ్ ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, తెలంగాణలోని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో వీరు బెట్టింగ్ టీంలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లో బెట్టింగ్‌లు వాళ్లకు నచ్చిన జట్టు మీద బెట్టింగ్ కాసి వలగాని రామకృష్ణ వీరు చెప్పిన జట్టు మీద ఎంత డబ్బులు బెట్టు పెట్టారో నోట్‌బుక్ లో నోట్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెట్టింగ్‌కు సంబంధించిన నగదును ఆన్‌లైన్ ద్వారా ముందుగానే తీసుకోవడం, మ్యాచ్ అనంతరం గెలిచిన వారికి నగదును ఆన్‌లైన్ ద్వారానే బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత కొంతకాలంగా మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో విక్రమ్, ప్రవీణ్ కుమార్, ఆనంద్ కిరణ్ బెట్టింగ్ చేస్తూ, బెట్టింగ్‌ను ప్రోత్సహించడం చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిలో వలగాని రామకృష్ణ, తొట్టింపూడి విక్రమ్, ఆనంద్ కిరణ్, దార ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని మహబూబాబాద్ పోలీసులకు వాట్సాప్ నంబర్ 8712656999లో తెలియజేయాలన్నారు. సమాచారం సేకరించి నేరస్తులను పట్టుకున్న మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సంతోష్, రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, రామకృష్ణ, దిలీప్, వీరస్వామిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించి, రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్

మహబూబాబాద్ డీడీకి పుత్రశోకం



నివాళులర్పిస్తున్న ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య



పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక, పీఓ అంకిత్

- గుండెపోటుతో తనయుడి మృతి



ప్రదీప్‌కిరణ్ కుమార్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మంకిడి ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది. మంకిడి ప్రదీప్‌కిరణ్‌కుమార్(31) ఆదివారం రాత్రి అకాల మరణం చెందాడు. హనుమకొండలోని గోపాలపురంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కుమారుడు ప్రదీప్‌కు ఛాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రదీప్ ఇంట్లోనే ఉండి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రదీప్‌తోపాటు మరో కుమారుడు, కుమార్తె ఉంది. చేతికి అందిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో ఎర్రయ్య కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

నర్సాపూర్‌లో అంత్యక్రియలు

మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య కుమారుడు ప్రదీప్‌కిరణ్‌కుమార్ మృతి చెందగా ఆయన స్వగ్రామమైన తాడ్వాయి మండలం నర్సాపూర్ (పీఏ) గ్రామానికి సోమవారం ఉదయం తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు కృష్ణ ఆదిత్య, శశాంక, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్‌లు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే జెడ్పీ వైస్‌చైర్మన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, ఐటీడీఏ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరామర్శించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

కురవి : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సీరోలు మండలం చింతపల్లి శివారు భూక్యతండాలో చోటు చేసుకుందని సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..భూక్య తండాకు చెందిన మాజీ సర్పంచ్ సాంక్రియా నాయక్ పెద్దకుమారుడు భూక్య వెంకన్న(45) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు చేరుకుని సాంక్రియానాయక్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, ఎంపీటీసీ బోజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ చందూలాల్, మాజీ సొసైటీ చైర్మన్ బీకోజీనాయక్, నాయకులు మామిళ్ల వెంకన్న, బాలాజీ, నరహరి, ఉపసర్పంచ్ జేరిపోతుల రంగన్నగౌడ్, దేవ్‌సింగ్, పత్తిసింగ్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి... శవమై కనిపించాడు



సాయిలు (ఫైల్)

కేసముద్రం: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ వ్యక్తి..చెరువులో శవమై కనిపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన కొమ్మనబోయిన సాయిలు(48) ఓ రైతు వద్ద జీతం ఉన్నాడు. అయితే బావిలో మునిగిన విద్యుత్ మోటార్లను తీసే గజ ఈతగాడిగా సాయిలుకు మంచి పేరుంది. ఈనెల 21న భార్య నాగమ్మ పనికి వెళ్లగా, ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇనుగుర్తి గ్రామశివారు గుంటి చెరువులో మత్తడివైపునకు సాయిలు మృతదేహం తేలి ఉండగా అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు చెరువువద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని, మృతదేహన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు చెరువులో శవమై కనిపించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చివరి రోజు సరుకులు మాయం

గూడూరు: వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలలో మిగిలిన సరుకులను ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది తీసుకెళ్తూ గ్రామస్తులకు పట్టుబడిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెసవి సెలవుల దృష్ట్యా మంగళవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఆశ్రమంలో మిగిలిన సరుకులను గుర్తించి రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. కానీ ఈ పాఠశాలలో మాత్రం అందులో పనిచేసిన సిబ్బంది ప్రిన్సిపాల్‌తో, తిరిగి పాఠశాల ప్రారంభమయ్యే వరకు మిగిలిన సరుకులు పురుగులు పట్టి పాడవుతాయి. మిగిలిన పప్పులు పని చేసిన తమకు అరకిలో చొప్పున ఇవ్వమన్నారు. దీంతో ప్రిన్సిపాల్ వసంత మిగిలిన 5 కేజీల పప్పును సిబ్బందికి ఇచ్చింది. మిగతా సరుకులను తమ బ్యాగ్‌లో పెట్టుకొని పాఠశాలకు తాళం వేసి బయలుదేరారు. ఈ దృష్యాన్ని ముందుగా తెలుసుకున్న గ్రామస్తులు గేటు ఎదురుగా ఉండి వీడియో తీయడం గుర్తించిన ప్రిన్సిపాల్ సరుకులను వదిలేసి వెళ్లింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ వసంతను వివరణ కోరగా సిబ్బంది అడిగితే ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది తీసుకెళ్లిన సరుకులను తిరిగి సేకరిస్తానని సమాధానమిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్స్

- విద్యార్థులకు ప్రగతిపత్రాల అందజేత
- నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో చివరి పనిదినం సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశంలో విద్యార్థుల అకాడమిక్ సామర్థ్యాల సాధనపై తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపారు. ఇటీవల ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. అందులో వచ్చిన మార్కుల ప్రగతిపత్రాలను ఆన్‌లైన్‌లోనూ సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ క్యూమిలేటివ్ ప్రగతి పత్రాలను ప్రతీ పాఠశాలలోనూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించారు. కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు కొంతమేర హాజరు కాగా.. మరికొన్ని పాఠశాలల్లో అంతంత మాత్రంగానే.. హాజరైనట్లు సమాచారం. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందించారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు హెచ్‌ఎంలు పలు సూచనలు చేశారు. సోమవారంతో ఈవిద్యా సంవత్సరం ముగిసింది. ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు. మళ్లీ పాఠశాలలు జూన్ 12న రీ ఓపెన్ చేస్తారు. అయితే జూన్ ఒకటి నుంచి బడిబాట ఉండే అవకాశం ఉండే అవకాశం ఉంది.



నారాయణగిరి స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

- స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ షాక్

గార్ల: విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పోచారంలో చోటుచేసుకుంది. విద్యుత్‌శాఖ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వాంకుడోత్ ఉపేందర్ (43) గత 18 ఏళ్లుగా గార్ల విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత రాత్రి వీచిన గాలిదుమారం ఈదురుగాలులకు పోచారం పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్‌స్తంభం ఒరిగి వేరే విద్యుత్ లైన్‌మీద పడింది. విధి నిర్వహణలో భాగంగా ఉపేందర్ పోచారం వెళ్లి ఎల్‌సీ తీసుకొని, వేరే లైన్ ఎల్‌సీ తీసుకోకుండా మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై స్తంభంపై నుంచి ఉపేందర్ కిందపడిపోయాడు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ ఏఈ మహేంద్రబాబు హుటాహుటిన ఉపేందర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స జరుగుతుండగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. వైద్యం చేయిస్తుండగా ఉపేందర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఉపేందర్ (ఫైల్)

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

విధి నిర్వహణలో మృతి చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి ఉపేందర్ కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా కుటుంబంలో ఒకరికి విద్యుత్‌శాఖలో ఉద్యోగం కల్పించాలని నాయకులు కందునూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సక్రు, రామారావు కోరారు.